వెంకయ్యకు చిరంజీవి ఆత్మీయ సత్కారం

- పద్మవిభూషణుల పరస్పర అభినందన
- వెంకయ్య నాకు స్ఫూర్తి: చిరంజీవి

శుక్రవారం హైదరాబాద్‌లోని వెంకయ్యనాయుడు నివాసంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న చిరంజీవి

పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికైన సినీనటుడు చిరంజీవిని కలిసి అభినందిస్తున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

సినిమా డెస్క్/హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): మాజీ ఉప రాష్ట్రపతి, పద్మవిభూషణ్ ఎం వెంకయ్యానాయుడిని పద్మవిభూషణ్, సినీ నటుడు చిరంజీవి ఆత్మీయంగా సత్కరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని వెంకయ్యానాయుడు నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. దేశంలో రెండో అత్యున్నత పౌర పురస్కారం వరించిన తరుణంలో ఒకరికొకరు పరస్పర అభినందనలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. 'నేను ఎప్పుడూ అంటుంటాను. తెలుగు చిత్ర పరిశ్రమకు ఎన్టీరామారావు, అక్కినేని నాగేశ్వరరావు రెండు నేత్రాలు అయితే చిరంజీవి మూడోనేత్రం. ఆయన త్రినేత్రుడు. చిరంజీవి పద్మవిభూషణ్ పురస్కారానికి పూర్తిగా అర్హుడు. సరైన సమయంలో భారత ప్రభుత్వం ఆయనకు సముచిత గౌరవం ఇచ్చింది. చిరంజీవిని చూస్తే నాకు చాలా గర్వంగా ఉన్నది' అన్నారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ.. 'పెద్దలు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు అంటే నాకు అపారమైన గౌరవం. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు ఆయన పిలుపుతో 'జై ఆంధ్ర' ఉద్యమంలో పాల్గొన్నా. పార్లమెంటులోనూ మేం కొలీగ్స్. ఆయన ప్రతి ఎదుగుదలను గమనిస్తూ ఉన్నాను. చాలా విషయాల్లో ఆయనే నాకు స్ఫూర్తి. ముఖ్యంగా తనను తాను మలుచుకుంటూ రాజకీయాల్లో స్వయంకృషితో తెలుగువారు గర్వించే స్థాయికి చేరుకున్నారు. ఆయన్ను పద్మవిభూషణ్ అవార్డుతో భారత ప్రభుత్వం సత్కరించడం, గౌరవించడం నాకు చాలా సంతోషంగా ఉన్నది. మరీ ముఖ్యంగా ఆయనతోపాటు నాకూ పద్మవిభూషణ్ రావడం మరింత ఆనందాన్నిచ్చింది' అని తెలిపారు.

నవభారత నిర్మాతలకు అంకితం: వెంకయ్యనాయుడు

భారత ప్రభుత్వం ప్రకటించిన పద్మ విభూషణ్ అవార్డును దేశంలోని రైతులు, యువత, మహిళలు సహా నవభారత నిర్మాణంలో భాగస్వాములు అవుతున్న ప్రతి ఒక్కరికీ అంకితం చేస్తున్నానని మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు ప్రకటించారు. అమృత కాలం దిశగా దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నదని తెలిపారు. ప్రస్తుత తరుణంలో భారత ప్రభుత్వం ప్రకటించిన పద్మ విభూషణ్ పురస్కారాన్ని వినమ్రంగా స్వీకరిస్తున్నానని చెప్పారు. ఈ పురస్కారం తన బాధ్యతను మరింతగా పెంచిందని పేర్కొన్నారు. శక్తివంతమైన, ఆత్మనిర్భర భారత నిర్మాణానికి ప్రజలతో కలిసి నడుస్తానని వెల్లడించారు.

వెంకయ్య, చిరంజీవికి కేటీఆర్ శుభాకాంక్షలు

కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్ఠాత్మక పద్మ విభూషణ్ అవార్డుకు ఎంపికైన మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు, ప్రముఖ సినీ నటుడు చిరంజీవికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన అభినందనలు తెలిపారు. వీరితోపాటు రాష్ట్రం నుంచి పద్మ శ్రీ అవార్డుకు ఎంపికైన ప్రముఖ చిందు యక్షగానం కళాకారుడు గడ్డం సమ్మయ్య, బుర్ర వీణ కళాకారుడు దాసరి కొండప్ప, వేలు ఆనంద చారి, కేతావత్ సోమ్లాల్, కూరెళ్ల విఠలాచార్యకు శుభాభినందనలు తెలిపారు. వెంకయ్యనాయుడు, చిరంజీవితో పాటు ఉమామహేశ్వరికి బీఆర్ఎస్ ఏపీ శాఖ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ శుభాకాంక్షలు తెలిపారు.

టీసీఎస్ అయాన్ ఇంటెల్లిజెమ్ రన్నరప్‌గా 'సంస్కృతి'

హైదరాబాద్, జనవరి 26: దేశంలోనే అతిపెద్ద జాతీయ స్థాయి పోటీ 'టీసీఎస్ అయాన్ ఇంటెల్లిజెమ్'లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని కొండూరు సంస్కృతి రన్నరప్‌గా నిలిచింది. ఏడో తరగతి చదువుతున్న ఈ బాలిక.. సీనియర్ క్యాటగిరీలో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. దేశంలోని 5-9 తరగతుల విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను వెలికితీసేందుకు టీసీఎస్ అయాన్.. ఇంటెల్లిజెమ్ పోటీని నిర్వహిస్తున్నది. సార్వత్రిక విలువలు, ప్రపంచ పౌరసత్వం, సమాచార నైపుణ్యాలు, సృజనాత్మకత-ఆవిష్కరణ, ఆర్థిక అవగాహన అంశాలపై పోటీ ఉంటుంది. ఇందులో భాగంగా.. సార్వత్రిక విలువలు, ఆర్థిక అవగాహన అంశాల్లో సంస్కృతి గ్రాండ్ ఫినాలే వరకు చేరుకొని పలువురి ప్రశంసలు అందుకొన్నది. వరుసగా రెండు సార్లు గ్రాండ్ ఫినాలేకు చేరుకున్న బాలిక ఈమే. దేశవ్యాప్తంగా వేల మంది విద్యార్థులు పోటీపడిన ఇంటెల్లిజెమ్‌లో 5 క్యాటగిరీల నుంచి 48 మంది విద్యార్థులు గ్రాండ్ ఫినాలేకు చేరుకున్నారు. ఈ పోటీలో సంస్కృతి నాలుగు క్యాటగిరీల్లో సెమీఫైనల్ చేరి, రెండు క్యాటగిరీల్లో ఫైనల్ వరకు చేరుకున్నది. అత్యంత పోటీ ఉంటే ఆర్థిక అవగాహన, సార్వత్రిక విలువలు అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ ఆమె ఈ స్థాయికి చేరుకోవటం గొప్ప విషయమని విద్యావేత్తలు అంటున్నారు. రాబోయే రోజుల్లో సంస్కృతి విన్నర్ టైటిల్ గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

స్థపతి ఆనందాచారికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న రాజేశ్వర్‌యాదవ్, తదితరులు

స్థపతి ఆనందాచారిని పాలకులు ఆదుకోవాలి

- జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్

హైదరాబాద్, జనవరి26 (నమస్తే తెలంగాణ): పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన వాస్తు స్థపతి ఆనందాచారి కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్, బీసీ నేతలు కోరారు. శుక్రవారం వారు ఆనందాచారిని స్వయంగా కలిసి ఘనంగా సత్కరించారు. పద్మశ్రీ అవార్డుకు ఎంపిక కావడంపై బీసీ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆయన సేవలను గుర్తించి అవార్డు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నిజాయితీ ఊపిరిగా జీవించిన ఆనందాచారి ప్రస్తుతం పేదరికంలో జీవిస్తున్నారని, దీనస్థితిలో ఉన్న ఆయన కుటుంబం ఉండటానికి ఇల్లు, ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, భిక్షపతి, మల్లేశ్, సాయివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు బీజేపీ ఎమ్మెల్యే సహకారం

తన ఇంటిని కూల్చేందుకు సిద్ధపడ్డ కాటిపల్లి

కామారెడ్డి, జనవరి 26: రోడ్డు విస్తరణలో భాగంగా అధికారుల సూచన మేరకు తన ఇంటిని కూల్చేందుకు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సిద్ధపడ్డారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం 9.30 గంటలకు అధికారుల సమక్షంలో స్వయంగా తన ఇంటిని కూల్చివేసేందుకు ముహూర్తం ఫిక్స్ చేసుకున్నట్టు ఆయన ప్రకటించారు.

గణతంత్ర వేడుకల్లో విషాదం

- కరెంట్ షాక్‌తో ఇద్దరి మృతి
- ములుగు జిల్లా కేంద్రంలో ఘటన

ములుగు రూరల్, జనవరి 26: ములుగు జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో విషాదం నెలకొన్నది. జాతీయ జెండా ఎగురవేసే క్రమంలో విద్యుత్తు షాక్‌తో ఇద్దరు మృతి చెందారు. ములుగు జిల్లా కేంద్రంలోని దళిత కాలనీకి చెందిన బోడ అంజిత్‌కుమార్ (36), లాడె విజయ్(25), లాడె చక్రి స్నేహితులతో కలిసి శివాలయం ఎదుట వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఇనుప రాడ్‌కు జాతీయ జెండాను కట్టి గద్దెపై నిలిపేందుకు పైకి లేపడంతో ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్తు తీగకు తగలడంతో అజిత్‌కుమార్, లాడె విజయ్, చక్రి కరెంట్ షాక్‌కు గురయ్యారు. తోటి మిత్రులు, స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అంజిత్‌కుమార్, విజయ్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. వైద్యం అందించడంతో చక్రి ప్రాణాలతో బయటపడ్డాడు. మంత్రి సీతక్క దవాఖానకు చేరుకొని చక్రితోపాటు మృతుల కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబాలను ఓదార్చి తక్షణ సాయంగా రూ.10 వేల చొప్పున రెండు కుటుంబాలకు అందించారు. విద్యుత్తు అధికారులతో మాట్లాడి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. జడ్పీచైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ప్రభుత్వ దవాఖానకు చేరుకొని మృతుల కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేలకొండపల్లిలో భక్తరామదాసు విగ్రహం?

- పోలీస్‌స్టేషన్ చెట్టు కింద గుర్తింపు
- కొత్త తెలంగాణ చరిత్ర బృందం వెల్లడి

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): ఖమ్మం జిల్లా నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలోని రావిచెట్టు కింద గుర్తించిన విగ్రహం భక్త రామదాసుదిగా భావిస్తున్నట్టు కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు తెలిపారు. విగ్రహానికి సంబంధించిన వివరాలను శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నేలకొండపల్లి స్థానికుడు పసుమర్తి శ్రీనివాస్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విగ్రహాన్ని గుర్తించారని తెలిపారు. కాసెపోసికట్టిన ధోవతితో, పైబట్ట లేకుండా అర్ధనగ్నంగా, అంజలిముద్రతో, మొన కిందికిపెట్టిన కత్తితో నిల్చుని, గోష్పాద శిఖతో కనిపిస్తున్న ఈ విగ్రహం రాజహోదా గల వ్యక్తిదని గుర్తించారు. కుడి, ఎడమ భుజాలమీద చక్ర, శంఖాల ముద్రలున్నందున వైష్ణవ భక్తుడిదని భావిస్తున్నట్టు కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు శ్రీరామోజు హరగోపాల్, కట్టా శ్రీనివాసులు వివరించారు. ఈ శిల్పం రాజోచిత ఆహార్యంతో లేనందున అక్కన్న, మాదన్నది కాదని.. వారి మేనల్లుడు, భద్రాచల రామాలయ నిర్మాత, నేలకొండపల్లి వాసి భక్త రామదాసుది కావడానికి అవకాశం ఉన్నదని అభిప్రాయపడ్డారు. రామదాసు ఎలా ఉండేవాడు? ఆయ న ఆహార్యం ఏమిటి? అనేది వీడని ప్రశ్నగానే ఉన్న నేపథ్యంలో కళాకారుల ఊహల మేరకు ఇప్పటివరకూ అనేక రకాల రామదాసు విగ్రహాలను తయారు చేసుకున్న ట్టు చెప్పారు. ఆయన సమకాలికంగా తయారైన విగ్రహాలు వెలుగులోకి రాలేదని, నేలకొండపల్లి విగ్రహం రామదాసుదేనని అభిప్రాయపడుతున్నారు.

సీపీఆర్‌తో ప్రాణం పోసిన ఏఎస్సై

సీపీఆర్ చేసి వ్యక్తిని కాపాడుతున్న ఏఎస్సై

మెదక్ అర్బన్, జనవరి 26 : సీపీఆర్‌తో ఓ వ్యక్తి నిండు ప్రాణాన్ని కాపాడారు ఏఎస్సై. మెదక్ జిల్లా హవేళీఘనపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శమ్నపూర్ గ్రామానికి చెందిన చింతామని భూదమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నది. కొడుకులకు భారం కావద్దనే ఉద్దేశంతో శుక్రవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నది. విషయం తెలియడంతో హవేళీ ఘనపూర్ ఏఎస్సై రాజు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అదే సమయంలో మృతురాలు భూదమ్మ కొడుకు బైరయ్య గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న ఏఎస్సై రాజు సమయస్ఫూర్తితో సీపీఆర్ చేసి ప్రాణాలు నిలబెట్టారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం బైరయ్యను దవాఖానకు తరలించారు. సీపీఆర్ చేసి వ్యక్తిని కాపాడిన ఏఎస్సైని ఎస్పీ అభినందించారు.

డాక్టర్ కావాలనే కల నెరవేరలేదని..

- ఆదిలాబాద్ గిరిజన విద్యార్థి బలవన్మరణం
- రష్యాలో సీటు వచ్చినా, యుద్ధం నేపథ్యంలో ఆలస్యం

ఆదిలాబాద్ రూరల్, జనవరి 26: డాక్టర్ కావాలనే కల నెరవేరకపోవడంతో మనస్తాపం చెందిన ఓ గిరిజన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సేవాదాస్ నగర్‌కు చెందిన హీర కుమ్ర సాయిపృథ్వీ (24) రెండేండ్ల క్రితం రష్యాలో ఎంబీబీఎస్ అడ్మిషన్ పొందాడు. ఇంతలోనే రష్యా - ఉక్రెయిన్ యుద్ధం మొదలవడంతో వెళ్లలేకపోయాడు. ఈ క్రమంలో చదువుకు అంతరాయం కాకుండా కుటుంబ సభ్యులు బీఎస్సీ న్యూట్రిషన్ కోర్సు కోసం హైదరాబాద్‌లో అడ్మిషన్ ఇప్పించారు. ఎంబీబీఎస్ చేయలేకపోయానని తరచూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదానం చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ప్రదీప్ సిన్హా. చిత్రంలో చికిత్స పొందుతున్న మహిళా మావోయిస్టు పార్వతి

మావోయిస్టుకు జవాన్ రక్తదానం

- ఎదురుకాల్పుల్లో మహిళా మావోయిస్టుకు గాయాలు
- రక్తదానం చేసి కాపాడిన జవాన్ ప్రదీప్ సిన్హా

కొత్తగూడెం క్రైం, జనవరి 26 : ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో జరిగిన ఎదురుకాల్పుల్లో గాయపడిన మహిళా మావోయిస్టుకు ఓ జవాన్ రక్తదానం చేసి ప్రాణాలు కాపాడారు. చింటౌలా అటవీ ప్రాంతంలో గురువారం మావోయిస్టులు సంచరిస్తున్నట్టు తెలుసుకొన్న డీఆర్జీ సూపర్-30 బృందం సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించింది. ఈ క్రమంలో మావోయిస్టులు ఎదురై కాల్పులు జరిపారు. అప్రమత్తమైన జవాన్లు వెంటనే ఎదురు కాల్పులు ప్రారంభించారు. మూడు రౌండ్ల కాల్పులు జరిపిన తర్వాత మావోయిస్టులు దట్టమైన అటవీ ప్రాంతంలోకి పరారయ్యారు. అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఘటనాస్థలంలో బుల్లెట్ గాయంతో బాధపడుతున్న ఓ మహిళా మావోయిస్టును గుర్తించారు. జవాన్లు వెంటనే ఆమెను ప్రత్యేక వాహనంలో గరియాబంద్ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మావోయిస్టుకు రక్తం అత్యవసరం కావడంతో శుక్రవారం ప్రదీప్ సిన్హా అనే హెడ్‌కానిస్టేబుల్ స్పందించి రక్తదానం చేసి ఆమె ప్రాణాలను కాపాడారు. సదరు మావోయిస్టును బీజాపూర్ జిల్లా సిల్గేర్ గ్రామానికి చెందిన పార్వతిగా గుర్తించారు. మహిళా మావోయిస్టుకు రక్తదానం చేసిన హెడ్‌కానిస్టేబుల్‌ను అక్కడి పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

'టీఎం-33' బాధితుల గోడు వినేదెవ్వరు?

- దరఖాస్తులను ముట్టని అధికారులు
- పరిష్కారం ఆపాలన్న సర్కారు?
- సీసీఎల్ఏ చుట్టూ బాధితుల ప్రదక్షిణలు

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): 'సార్.. వచ్చే నెల నా బిడ్డ పెండ్లి ఉన్నది. పెండ్లి ఖర్చుల కోసం భూమి అమ్ముదామంటే నా పొలం పొరపాటున నిషేధిత జాబితాలో పడింది. దానిని మార్చాలని ఎప్పుడో మీసేవ నుంచి దరఖాస్తు ఇచ్చిన. మండలాఫీస్, కలెక్టరేట్, ఇప్పుడు సీసీఎల్ఏ.. ఇట్ల అన్ని ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా పని అయితలేదు' రంగారెడ్డి జిల్లా నుంచి సీసీఎల్ఏకు వచ్చిన చెందిన ఓ రైతు ఆవేదన ఇది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాలు మొదలు సీసీఎల్ఏ వరకు రోజూ వందల మంది బాధితులు తమ దరఖాస్తులు పరిష్కరించాలంటూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. సాఫ్ట్‌వేర్‌లో ఉన్న లోపాలు, అధికారుల తప్పిదం, డాటా ఎంట్రీ లోపాల వల్ల కొందరు రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. పొరపాటున భూములు నిషేధిత జాబితాలో పడటం, పాస్ బుక్‌లో తప్పులు, విస్తీర్ణం తక్కువగా నమోదవటం.. తదితర సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే గుర్తించింది. ఏడాదిన్నర కిందటే 'టీఎం-33' (ట్రాన్సాక్షన్ మాడ్యూల్) అందుబాటులోకి తెచ్చింది. భూములకు సంబంధించిన దాదాపు అన్ని రకాల సమస్యలకు ఈ మాడ్యూల్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. మీసేవ ద్వారా దరఖాస్తు చేస్తే నేరుగా కలెక్టర్ లాగిన్‌కు వెళ్తుంది. కలెక్టర్ అధికారుల ద్వారా క్షేత్రస్థాయి విచారణ జరిపించి, నివేదిక తెప్పించుకొని, పరిశీలించి, మార్పులు చేర్పులు చేసేందుకు ఈ మాడ్యూల్ అవకాశం కల్పించింది. ఇలా ఇప్పటివరకు లక్షల దరఖాస్తులను అధికారులు డిస్పోజ్ చేశారు. అధికారులు కొన్నిరోజులుగా ఈ దరఖాస్తుల పరిష్కారాన్ని పూర్తిగా పక్కనబెట్టారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం టీఎం-33 దరఖాస్తుల పరిష్కారాన్ని నిలిపివేయాలని కలెక్టర్లను ఆదేశించినట్టు ప్రచారం ఉన్నది. ఈ నేపథ్యంలోనే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచినట్టు సమాచారం. దీంతో అత్యవసర పరిస్థితి ఉన్న రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం వేసిన ధరణి కమిటీపై నివేదిక వచ్చే వరకు టీఎం-33 దరఖాస్తుల పరిష్కారాన్ని పక్కనబెట్టాలని సూచించినట్టు తెలిసింది. దీంతో కమిటీకి, తమకు సంబంధం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం, రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు మాత్రం దరఖాస్తులను ఆపాలని ఆదేశాలు ఇవ్వలేదని చెప్పడం గమనార్హం. దీంతో బాధితులు మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అనుమానం ఉన్న దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టాలని, పారదర్శకంగా ఉన్న వాటిని పరిష్కరిస్తే తమకు మేలు కలుగుతుందని కోరుతున్నారు.

ఉత్తమ ప్రశంసలు.. అంతలోనే ఆగిన ఊపిరి

- ఆదిలాబాద్ మున్సిపల్ మేనేజర్ హఠాన్మరణం

చెన్నమనేని దివాకర్‌రావు (ఫైల్)

ఆదిలాబాద్ రూరల్, జనవరి 26: గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రం అందుకున్న ఓ అధికారి కొద్దిసేపటికే గుండెపోటుతో కన్నుమూశారు. ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం మేనేజర్ చెన్నమనేని దివాకర్‌రావు (56) శుక్రవారం ఉత్తమ అధికారిగా కలెక్టర్ రాహుల్ రాజ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. అనంతరం ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికే అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు ప్రైవేట్ దవాఖానకు తరలించగా అప్పటికే గుండెపోటు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దివాకర్‌రావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. 15 రోజుల క్రితం హైదరాబాద్‌లో చికిత్స పొందారు.

గోవింద కోటి రాసిన యువతకు బ్రేక్ దర్శనం

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంలో టీటీడీ కీలక నిర్ణయం తీసుకొన్నది. 25 ఏండ్లలోపు యువత 'గోవింద కోటి' అని పది లక్షల 116 సార్లు రాస్తే శ్రీవారి బ్రేక్‌దర్శనం కల్పిస్తామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. యువతలో తిరుమల శ్రీవారిపై భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించటంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకొన్నట్టు వెల్లడించారు. శుక్రవారం తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈవో ధర్మారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఏప్రిల్ నెల శ్రీవారి దర్శన టికెట్లు పొందిన భక్తులకు మాత్రమే మొదటిసారిగా వసతి గదులు కేటాయింపును ఆన్‌లైన్‌లో చేపట్టినట్టు ధర్మారెడ్డి తెలిపారు. అన్నప్రసాద విభాగాన్ని పునరుద్ధరించినట్టు చెప్పారు. శ్రీవారి దర్శనానికి సుమారు 24 గంటల సమయం పడుతుందని వెల్లడించారు.

మూడు రోజుల పాటు కొనసాగనున్న శతావధానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వక్తలు

ఆకట్టుకున్న వద్దిపర్తి శతావధానం

తెలుగు యూనివర్సిటీ, జనవరి 26 : దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక ఆధ్వర్యంలో మహాసహస్రావధాని, ప్రణవపీఠం వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ డాక్టర్ వద్దిపర్తి పద్మాకర్ 19వ శతావధాన కార్యక్రమం తెలంగాణ సారస్వత పరిషత్తు హాల్‌లో శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు కొనసాగనున్న శతావధానాన్ని ద్విసహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ, శాంతాబయోటెక్ అధినేత డాక్టర్ కే ఐ వరప్రసాదరెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వద్దిపర్తి శతావధానం ఆకట్టుకున్నది. కార్యక్రమంలో పండితులు మారుమాముల దత్తాత్రేయశర్మ, వెంకటరమణ శర్మ, పాలపర్తి శ్యామాలానంద ప్రసాద్, మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి, బండికాడి అంజయ్య పాల్గొన్నారు.

రెండున్నర నెలల్లో 13 పులులు మృతి

- మహారాష్ట్ర, తెలంగాణ అటవీ అధికారుల్లో కలవరం
- స్థానికులు విషప్రయోగాలకు దిగడంపై ఆందోళన
- ఉమ్మడి కార్యాచరణతో అడ్డుకోవాలని నిర్ణయం

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు అటవీ ప్రాంతాల్లో వరుసగా పులులు మృతి చెందడం అధికారులను కలవరపెడుతున్నది. గతేడాది జనవరి 1 నుంచి డిసెంబర్ 25 వరకు దేశవ్యాప్తంగా 200కుపైగా పులులు మృతి చెందినట్టు తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కాగా, గత రెండున్నర నెలల్లో మహారాష్ట్ర, తెలంగాణలోనే 13 పులులు మృత్యువాత పడటంతో రెండు రాష్ట్రాల అటవీశాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి మహారాష్ట్ర, తెలంగాణ అడవుల్లో పులుల సంతతి పెరిగింది. దీంతో వాటిపై ఒత్తిడి పెరిగి స్థావరాల ఏర్పాటు కోసం సమీప గ్రామాల్లోకి ప్రవేశిస్తున్నాయి. పంట పొలాల్లో సంచరిస్తూ మనుషులు, పశువులపై తరచూ దాడులకు పాల్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వాటిని చంపేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇటీవల విషప్రయోగానికి గురైన ఓ పశువును తిని రెండు పులులు మరణించడమే ఇందుకు నిదర్శనం. ఇప్పటివరకు స్థానికుల సహకారంతో అడవులను, వన్యప్రాణులను రక్షించే వాళ్లమని, ఇప్పుడు ప్రజలే వణ్యప్రాణులను చంపుతుండటం ఆందోళన కలిగిస్తున్నదని అటవీశాఖ ఉన్నతాధికారులు చెప్తున్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అధికారుల దృష్టి

వన్యప్రాణుల సంరక్షణపై మహారాష్ట్ర, తెలంగాణ అటవీ అధికారులు దృష్టి సారించారు. అందులో భాగంగా పులులు, ఇతర క్రూర మృగాల ఉనికిని తెలుసుకుని సంబంధిత సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు తొలుత ఉమ్మడి సమావేశాన్ని నిర్వహించి, కార్యాచరణ రూపొందించాలన్న అభిప్రాయానికి వచ్చారు. తడోబా, కవ్వాల్ టైగర్ రిజర్వుల పరిధిలో పులుల కదలికలను పర్యవేక్షించేందుకు ఆధునిక సాంకేతికతో కూడిన వ్యవస్థను ఏర్పాటు చేయడంతోపాటు వన్యప్రాణుల సంరక్షణపై అటవీ గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు.

నిరుడు 204 పులులు మృతి

జాతీయ గణాంకాల ప్రకారం 2022 నాటికి దేశంలో 3,167 పులులు ఉన్నాయి. వీటిలో 204 పులులు నిరుడు జనవరి 1 నుంచి డిసెంబర్ 25 మధ్య కాలంలో మృతి చెందినట్టు వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ సొసైటీ ఆఫ్ ఇండియా (డబ్ల్యూపీఎస్ఐ) వెల్లడించింది. మహారాష్ట్రలో 52, మధ్యప్రదేశ్‌లో 45 , ఉత్తరాఖండ్‌లో 26, తమిళనాడులో 15, కేరళలో 15, కర్ణాటకలో 13, అస్సాంలో 10, రాజస్థాన్‌లో 10, ఉత్తరప్రదేశ్‌లో 7, బీహార్‌లో 3, ఛత్తీస్‌గఢ్‌లో 3, ఒడిశాలో 2, ఏపీలో 2, తెలంగాణలో ఒకటి చనిపోయినట్టు వివరించింది. వీటిలో 79 పులులు వేటగాళ్ల వల్ల, 46 పులులు అంతర్గత ఘర్షణల వల్ల, 7 పులులు ప్రమాదాల వల్ల, 2 పులులు ఇతర జంతువుల దాడుల వల్ల, ఒక పులి స్థానికుల దాడిలో మృతిచెందినట్టు వివరించింది.

ఖాందేవ్ జాతర ప్రారంభం

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలో తొడసం వంశీయుల ఆధ్వర్యంలో ఖాందేవుడి మహాజాతర శుక్రవారం ప్రారంభమైంది. జాతరలో భాగంగా మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా జీవితి తాలుకాలోని కొద్దేపూర్‌కు చెందిన నాగుబాయి విశ్వశాంతిని కోరుతూ రెండున్నర కిలోల నువ్వుల నూనె తాగింది. ఈ జాతరకు ఆదిలాబాద్, మహారాష్ట్ర నుంచి తొడసం వంశీయులు, భక్తులు తరలివచ్చారు.

– నార్నూర్

కొల్చారంలో జాతీయ జెండాకు అవమానం

కొల్చారం, జనవరి 26: మెదక్ జిల్లా కొల్చారం మండలంలో జాతీయ జెండాకు అవమానం జరిగింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం కొల్చారం రైతు వేదిక వద్ద క్లస్టర్ ఏఈవో వినీతభవాని జాతీయ పతాకాని ఆవిష్కరిస్తుండగా మధ్యలోనే జెండా కింద పడిపోయింది. వెంటనే ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది అంజద్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి వినీతభవాని జెండాను సరిచేస్తుండగానే ఇతర శాఖల అధికారులు జెండా వందనం సమర్పించగా, కేజీబీవీ విద్యార్థినులు జాతీయ గీతాన్ని ఆలపించారు. ఇదంతా జరుగుతుండగా తహసీల్దార్ మహ్మద్ గఫార్ మియా, ఎంపీడీవో గణేశ్‌రెడ్డి, ఎంపీపీ మంజుల, ఏవో శ్వేతకుమారి అక్కడే ఉన్నారు. కాగా మండలంలోని ఎనగండ్ల రైతు వేదిక వద్ద ఆవిష్కరించిన జాతీయ జెండా ప్రముఖుల మృతికి సంతాప సూచకంగా అవనతనం చేసినట్లుగా ఉంది.